https://teluguislam.net



# మహాప్రవక్త (స) కుటుంబం

1. హిజ్రత్‌కు పూర్వం మక్కాలో దైవప్రవక్త (స) కుటుంబమంతా ఆయన సతీమణి ఖదీజా (ర) ఒక్కరే. ఆయన (స) వివాహం ఆయన ఇరవై అయిదవ ఏట జరిగింది. అప్పుడు హజ్రత్ ఖదీజా (ర)గారి వయస్సు నలభై ఏండ్లు. ఈమె ఆయనకు మొదటి భార్య. ఆమె బ్రతికి ఉండగా దైవప్రవక్త (స) మరే వివాహం చేసుకోలేదు. ఆయన(స) సంతానం ఒక్క హజ్రత్ ఇబ్రాహీం తప్ప కుమారులు, కుమార్తెలందరూ ఆమె గర్భాన జన్మించినవారే. కుమారుల్లో ఏ ఒక్కరూ జీవించి ఉండలేదు. అయితే కుమార్తెలందరూ సజీవంగానే ఉండినారు. వారి పేర్లు ఇవి:

1. హజ్రత్ జైనబ్ (ర)
2. హజ్రత్ రుఖయ్యా (ర)
3. హజ్రత్ ఉమ్మె కుల్సూమ్ (ర) మరియు
4. హజ్రత్ ఫాతిమా (ర)లు.

హజ్రత్ జైనబ్ (ర) పెళ్ళి హిజ్రత్‌కు పూర్వం ఆమె మేనత్త కుమారుడు హజ్రత్ అబుల్ ఆస్ బిన్ రబీతో జరిగింది. హజ్రత్ ఉస్మాన్ (ర)తో హజ్రత్ రుఖయ్యా (ర) వివాహం జరిగింది. ఆమె చనిపోయిన తరువాత దైవప్రవక్త(స) హజ్రత్ ఉమ్మె కుల్సూమ్ (ర) వివాహం తిరిగి ఆయనతోనే చేశారు. హజ్రత్ ఫాతిమా (ర) వివాహం, బద్ర్ యుద్ధం మరియు ఉహద్ యుద్ధం మధ్య కాలంలో హజ్రత్ అలీ (ర)తో జరిగింది. ఆమె గర్భాన హజ్రత్ హసన్(ర), హజ్రత్ హుసైన్ (ర)లు (కుమారులు) హజ్రత్ జైనబ్, ఉమ్మె కుల్సూమ్‌లు (కుమార్తెలు) జన్మించారు.

దైవప్రవక్త (స) తన సమాజానికి భిన్నంగా, ఓ ప్రత్యేకతను సంతరించుకొని ఉన్నారు. వివిధ అవసరాల దృష్ట్యా ఆయన నల్గురికంటే ఎక్కువ

https://teluguislam.net



మంది భార్యలను వివాహం చేసుకొనే రాయితీ దైవం ఆయనకు ఒసిగాడన్న విషయం విదితమే. కాబట్టి ఆయన (స) ఏ స్త్రీలనైతే వివాహ మాడారో వారు మొత్తం పదకొండుగురు. వారిలో తొమ్మండుగురు ఆయన పరమపదిం చేటప్పుడు సజీవంగానే ఉన్నారు. ఇద్దరు ఆయన (స) జీవిత కాలంలోనే మరణించారు. (అంటే హజ్రత్ ఖదీజా (ర) మరియు ఉమ్ముల్ మసాకీన్ హజ్రత్ జైనబ్ బిన్తె కజీమా -ర-లు) వీరేకాకుండా మరిద్దరు ఉన్నా రనేది, వారితో ఆయన నికాహ్ జరిగిందా లేదా అనే విషయంలో అభిప్రాయ భేదం ఉంది. కాని వారు ఆయన (స)తో రాత్రి గడపలేదనేది ఏకాభిప్రాయంతో ఒప్పుకున్న విషయం. ఈ క్రింద మేము ప్రవక్త (స) సతీమణుల పేర్లు, వారి వివరాలు క్రమపద్ధతిలో సంగ్రహంగా మీ ముందుంచుతున్నాం.

## 2. హజ్రత్ సౌదా బిన్తె జమ్ఆ (ర)

ఈమెగారితో దైవప్రవక్త (స) వివాహం, హజ్రత్ ఖదీజా (ర) మరణా నంతరం, ప్రవక్త అయిన పదవ సంవత్సరం షవ్వాల్ నెలలో జరిగింది. హజ్రత్ సౌదా (ర) అంతకు ముందు తమ పినతండ్రి కుమారుడు సక్రాన్ వివాహ బంధంలో ఉంటూ ఉండేవారు. సక్రాన్ మరణించడం వల్ల ఆమె అప్పుడు వితంతువుగా ఉన్నారు.

## 3. హజ్రత్ ఆయిషా సిద్దీకా బిన్తె అబూ బక్ర్ (ర)

దైవప్రవక్త (స), ఆమెను ప్రవక్త పదవి లభించిన పదకొండవ యేట షవ్వాల్ నెలలో వివాహమాడారు. అంటే హజ్రత్ సౌదా (ర)ను వివాహం చేసుకున్న ఒక సంవత్సరం తరువాత, హిజ్రత్ కంటే రెండు సంవత్సరాల అయిదు నెలలకు ముందు అన్నమాట. అప్పుడు ఆమె వయస్సు ఆరు సంవత్సరాలు. హిజ్రత్ తరువాత ఏడు నెలలకు షవ్వాల్ నెల, హిజ్రీ శకం ఒకటిలో ఆమెను దైవప్రవక్త (స) వద్దకు పంపించడం జరిగింది. అప్పుడు ఆమె వయస్సు తొమ్మిది సంవత్సరాలు, ఆమె అప్పుడు కన్య. ఆమెను తప్ప మరే కన్యను మహాప్రవక్త (స) వివాహం చేసుకోలేదు. హజ్రత్ ఆయిషా (ర) దైవప్రవక్త (స)కు అతిప్రియమైన సతీమణి. సమాజంలోని స్త్రీలందరికంటే ఆమె ఒక్కరే ధర్మజ్ఞానం కలిగిన విద్యావంతురాలు.

https://teluguislam.net



### 4. హజ్రత్ హఫ్సా బిన్తె ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)

ఈమె మొదటి భర్త కనీస్ బిన్ హుజాఫా సహమీ (ర). ఈయన బద్ర్ మరియు ఉహద్ యుద్ధాల మధ్యకాలంలో చనిపోవడం వలన హజ్రత్ హఫ్సా (ర) వితంతువు అయ్యారు. ఆ తరువాత మహాప్రవక్త (స) ఆమెను వివాహమాడారు. ఇది హిజ్రీ శకం మూడవ సంవత్సరంనాటి మాట.

### 5. హజ్రత్ జైనబ్ బిన్తె కజీమా (ర)

ఈమె బనూ హిలాల్ బిన్ ఆమిర్ సఅసఆ తెగవారు. నిరుపేదలపై ఆమె చూపే ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాల కారణంగా ఆమె ఉమ్ముల్ మసాకీన్ (నిరుపేదల తల్లి)గా ప్రఖ్యాతిగాంచారు. ఈమె హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ హజష్‌కు భార్య. అయన ఉహద్ యుద్ధంలో అమరగతి నొందిన తరువాత దైవప్రవక్త (స) ఆమెను వివాహమాడారు. కేవలం ఎనిమిది నెలలు మాత్రమే భార్యగా ఉండి మరణించారు.

### 6. హజ్రత్ ఉమ్మె సల్మా బిన్తె అబీ ఉమయ్యా (ర)

ఈమె క్రితం అబూ సల్మాకు భార్యగా ఉండేవారు. హి.శ.4, జమాదిల్ ఆఖిరా నెలలో హజ్రత్ అబూ సల్మా(ర) చనిపోయిన తరువాత అదే సంవత్సరం షవ్వాల్ నెలలో మహాప్రవక్త (స) ఈమెను వివాహమాడారు.

### 7. జైనబ్ బిన్తె హజష్ బిన్ రియాబ్ (ర)

ఈమె బనూ అసద్ బిన్ కజీమా కుటుంబానికి సంబంధించిన వారు. దైవప్రవక్త (స) కు మేనత్త కూతురు కూడా. ఈమె వివాహం మొదట జైద్ బిన్ హారిసా (ర)తో జరిగింది. ఈయన్ను దైవప్రవక్త (స) గారి కుమారుడుగా తలచడం జరిగేది. కాని హజ్రత్ జైద్ (ర)తో ఆమెకు పొసగలేదు. జైద్(ర) ఆమెకు తలాక్ ఇచ్చారు. ఇద్దత్ గడువు పూర్తి అయిన తరువాత దైవప్రవక్త (స)ను సంబోధిస్తూ దివ్యఖుర్‌ఆన్‌లో ఈ ఆయత్ అవతరించింది:

فَلَمَّا قَضٰى زَيْدٌ مِّنْهَا وَطَرًا زَوَّجْنٰكَهَا

"జైద్ ఆమెతో తన అవసరం పూర్తి చేసుకున్న తరువాత మేము ఆమెను ఆయన (స) భార్యగా చేశాము."

https://teluguislam.net



ఆయనకు సంబంధించే అహ్జాబ్ సూరాలో మరిన్ని ఆయత్‌లు అవతరించాయి. ఆ ఆయత్‌లలో దత్తపుత్రునికి సంబంధించి ఖచ్చితమైన తీర్పు ఇవ్వడం జరిగింది- వివరాలు ముందు రాబోతున్నాయి- హజ్రత్ జైనబ్ (ర)తో దైవప్రవక్త (స) వివాహం హి.శ. 5, జీకాదా మాసంలో లేదా అంతకంటే కొంచెం ముందుగా జరిగింది.

## 8. జువైరియా బిన్తె హారిస్ (ర)

ఈమె తండ్రిగారు ఖుజాఅ తెగకు చెందిన బనుల్ ముస్తలిక్ సర్దారు. హజ్రత్ జువైరియా (ర) బనూ ముస్తలిక్ ఖైదీల వెంట బందీ అయివచ్చినవారు. బందీల పంపకం జరిగేటప్పుడు ఈమె సాబిత్ బిన్ కైస్ బిన్ షమాస్ (ర)గారి భాగానికి వచ్చారు. ఆయన, ఆమెతో, ఓ ధనరాశికి బదులు స్వతంత్రురాలుగా చేస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఆమె తరపున ఆ మొత్తాన్ని కట్టి విడిపించి వివాహం చేసుకున్నారామెను. ఇది హి.శ. 5 లేదా 6, షాబాన్ నెలలో జరిగిన సంఘటన.

## 9. ఉమ్మె హబీబా రమలా బిన్తె అబీ సుఫ్‌యాన్ (ర)

ఈమె మునుపు ఉబైదుల్లాహ్ బిన్ హజష్ వివాహబంధంలో ఉన్న మహిళ. అతని వెంట హిజ్రత్ చేసి అబీసీనియాకు కూడా వెళ్ళారు. కాని ఉబైదుల్లాహ్ అక్కడకు వెళ్ళిన తరువాత ధర్మభ్రష్టుడై క్రైస్తవ మతాన్ని స్వీకరించాడు. అక్కడే చనిపోయాడు. అయితే ఉమ్మె హబీబా (ర) మాత్రం ఇస్లామ్ ధర్మంపై స్థిరంగా ఉండిపోయారు. దైవప్రవక్త (స), హిజ్రీ శక సంవత్సరం 7లో, అమ్రూ బిన్ ఉమయ్యా జమ్రీకు లేఖ ఇచ్చి నజాషీ వద్దకు పంపారు. ఆ లేఖలో ఉమ్మె హబీబా (ర)తో తమ నికాహ్ చేయమని కూడా రాశారు. నజాషీ, ఉమ్మె హబీబా స్వీకారంతో ఆమె నికాహ్ దైవప్రవక్త (స)తో చేసివేశాడు. షుర్జీల్ బిన్ హస్నా వెంట ఆమెను దైవప్రవక్త (స) వద్దకు పంపించడం జరిగింది.

## 10. హజ్రత్ సఫియ్యా (ర) బిన్తె హుయయ్ బిన్ అక్తబ్

వీరు బనీ ఇస్రాయీల్ (యూదుల)కు చెందినవారు. ఖైబర్ యుద్ధం సందర్భంగా పట్టుబడి బందీగా వచ్చినవారు. కాని దైవప్రవక్త (స) ఆమెను

https://teluguislam.net



తన కోసం ఎంచుకొని స్వతంత్రురాలుగా చేసి వివాహమాడారు. ఇది ఖైబర్ విజయం హి.శ. 7 తరువాతి సంఘటన.

## 11. హజ్రత్ మైమూనా బిన్తె హారిస్ (ర)

ఈమె ఉమ్ముల్ ఫజ్ల్ లుబాబా బిన్తె హారిస్ సోదరి. దైవప్రవక్త (స) ఆమెను హిజ్రీ శక సంవత్సరం, జీకాదా నెలలో ఉమ్రయె కజా పూర్తి చేసి - ప్రామాణికమైన కథనం ప్రకారం, ఇహ్రామ్ నుండి హలాల్ అయిన తరువాత - వివాహమాడారు.

మహాప్రవక్త(స) వివాహమాడిన సతీమణుల సంఖ్య ఇలా పదకొండుకు చేరింది. వీరిలో ఇద్దరు హజ్రత్ ఖదీజా (ర) మరియు ఉమ్ముల్ మసాకీన్ హజ్రత్ జైనబ్ (ర) ఇద్దరూ ఆయన జీవించి ఉండగానే పరమపదించారు. మిగతా తొమ్మండుగురు సతీమణులు ప్రవక్త(స) మరణం తరువాత కూడా జీవించే ఉన్నారు. వారే కాకుండా, ఆయనతో సంసారం చేయని మరిద్దరు మహిళలున్నారు. వారిలో ఒకరు బనూ కిలాబ్‌కు చెందిన మహిళ అయితే మరొకరు 'కిందా' తెగకు చెందినవారు. ఈ కిందా తెగ మహిళే 'జోనియా'గా పిలువబడతారు. వీరితో దైవప్రవక్త (స) వివాహం జరిగిందా లేదా? వారి వంశ వృక్షం ఏమిటీ అనే విషయంలో సీరత్ చరిత్రకారుల నడుమ భేదాభిప్రాయాలున్నాయి. ఆ వివరాలేమిటో తెలిపే అవసరం ఇక్కడ లేదని అనుకుంటున్నాము.

ఇక స్త్రీ బానిసల విషయానికి వస్తే, దైవప్రవక్త (స) దగ్గర ఇద్దరు స్త్రీ బానిసలు ఉండేవారని తెలుస్తోంది. వారిలో ఒకరు 'మారియ కబ్తియా (ర)'. ఈమెను ఈజిప్టు చక్రవర్తి మకూకస్ దైవప్రవక్త (స)కు కానుకగా సమర్పించాడు. ఆమె గర్భాన ప్రవక్త (స) కుమారుడు ఇబ్రాహీం జన్మించారు. ఆయన బాల్యంలోనే హిజ్రీ శక సంవత్సరం 10, షవ్వాల్ నెల 28 లేక 29వ తేదీ (క్రీ.శ. జనవరి 27, 632)న మదీనాలో మరణించారు.

మరో బానిస స్త్రీ రైనా బిన్తె జైద్ (ర). ఈమె యూదుల తెగ బనీ నజీర్ లేదా బనూ కురైజాకు చెందినవారు: ఈమె బనూ కురైజా ఖైదీల్లో ఉండగా దైవప్రవక్త (స) ఆమెను తన కోసం ఎంపిక చేసుకొని తన దగ్గర ఉంచుకున్నారు.

https://teluguislam.net



కొందరు పరిశోధకులు, దైవప్రవక్త (స) ఆమెను బానిసగా కాకుండా స్వతంత్రురాలిగా చేసి వివాహమాడారని తలుస్తారు. కాని ఇబ్నె ఖైమ్ దృష్టిలో మొదటిదే సరిఅయినది. అబూ ఉబైదా (ర), ఈ ఇద్దరు స్త్రీ బానిసలే కాకుండా మరిద్దరు స్త్రీ బానిసల గురించి చెప్పారు. ఆ ఇద్దరిలో ఒకరి పేరు జమీలా. ఈమె ఏదో ఒక యుద్ధంలో బందీ అయి వచ్చారు. మరొకరు ఎవరో ఓ స్త్రీ బానిస. ఆమెను హజ్రత్ జైనబ్ బిన్తె హజష్ ప్రవక్త (స)కు బహూకరించారు.[1]

ఇక్కడి వరకు చెప్పుకున్న తరువాత మనం కొంచెం సేపు ఆగి, మహాప్రవక్త (స)గారి జీవితానికి సంబంధించిన మరో పార్శ్వాన్ని స్పృశించవలసిన అవసరం ఉంది. మహాప్రవక్త (స), లైంగిక శక్తి సమృద్ధిగా ఉన్న యవ్వన దశలోనే అంటే ముప్ఫై ఏండ్ల ప్రాయంలోనే ఒకే భార్యతో తృప్తిపడుతూ గడిపేశారు. ఆ భార్య కూడా దాదాపు వృద్ధాప్య దశకు చేరుకున్న భార్యే. అంటే మొదట ఖదీజా (ర) ఆ తరువాత హజ్రత్ సౌదా (ర)లు మాత్రమే. అయితే, ఆయన(స) వృద్ధాప్య దశకు చేరిన తరువాత హఠాత్తుగా ఒక వివాహం తరువాత మరొకటిగా తొమ్మిది వివాహాలు చేసుకోవడానికి ఆయనలో లైంగిక శక్తి అంతగా పెరిగిపోయిందన్న భావన ఏ విధంగా చూసినా సరియైన భావనేనా? కాదు. అలా జరగడానికి వీల్లేదు. దైవప్రవక్త (స) గారి యవ్వన దశ మరియు వృద్ధాప్య దశ రెంటిపై దృష్టిని సారించిన తరువాత ఏ వివేకవంతుడైనా అలాంటి భావన సరియైనది కాదు అని ఒప్పుకుంటాడు. యదార్థం ఏమిటంటే, ఆయన (స) ఇన్ని వివాహాలు, మరేవో అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేసుకున్నవే. ఈ వివాహాలు సాధారణ వివాహాలలో ఉండే నిర్ణీత ఉద్దేశ్యాలకంటే ఎంతో ఉన్నతమైనవి. ఇప్పుడు మనం ఆ ఉద్దేశ్యాలను కొద్దిగా తరచి చూద్దాం.

దైవప్రవక్త (స) హజ్రత్ ఆయిషా (ర), హజ్రత్ హఫ్సా (ర)లను వివాహమాడి, హజ్రత్ అబూ బక్ర్ (ర), హజ్రత్ ఉమర్ (ర)లతో ఏ వియ్యాన్ని అయితే అందుకున్నారో, అలాగే హజ్రత్ ఉస్మాన్(ర)కు హజ్రత్ రుకయ్యా(ర), హజ్రత్ ఉమ్మె కుల్సూమ్ (ర)లను ఒకరి తరువాత ఒకరినిచ్చి, హజ్రత్ అలి (ర)గారికి తన ముద్దుల కుమార్తె హజ్రత్ ఫాతిమానిచ్చి పెళ్ళి చేసి ఏ వియ్యాన్ని అయితే అందుకున్నారో, ఆ వివాహాల ఉద్దేశ్యం, ఆ నలుగురు మహా

1. *చూడండి, జాదుల్ ముఆద్-1/29.*

https://teluguislam.net



పురుషులతో తన సంబంధాలను పటిష్ఠపర్చుకోవడమే. ఈ నలుగురూ గడ్డు సమయాల్లో ఇస్లామ్ కోసం త్యాగం చేసిన మహామహులు. వారి ప్రత్యేకత ఏమిటో మనందరికీ తెలిసిందే.

అరబ్బు ఆచారం ప్రకారం, వియ్యపు బంధుత్వం ఎంతో గౌరవమైన దృష్టితో చూడబడుతుంది. వారి దృష్టిలో అల్లుని బంధుత్వం అంటే, వివిధ తెగల నడుమ దగ్గరి సంబంధానికి పునాదిలాంటిది. అల్లునితో యుద్ధం చేయడం సిగ్గుచేటు. ఈ సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకొని మహాప్రవక్త (స) మరికొన్ని వివాహాలు చేసుకోవలసి వచ్చింది. ఉద్దేశ్యం, వివిధ వ్యక్తులు, వివిధ తెగల శత్రుత్వాన్ని నీరుగార్చడం. వారిలో అప్పటి వరకు రగులు కుంటున్న ద్వేషాగ్ని కీలలను ఆర్పివేయడం, హజ్రత్ ఉమ్మె సల్మా (ర) బనీ మక్జూమ్ తెగకు చెందిన మహిళ. ఈ తెగ అబూ జహల్ మరియు ఖాలిద్ బిన్ వలీద్‌లకు చెందిన తెగ. మహాప్రవక్త(స) ఆమెతో వివాహమాడగా, ఇదివరకు ఉహద్ యుద్ధంలో ఖాలిద్ బిన్ వలీద్ ప్రదర్శించిన కఠిన వైఖరి కాస్తా చల్లారిపోయింది. కాగా, కొన్ని రోజుల అనంతరం ఆయన తన ఇష్ట పూర్తిగా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. అలాగే అబూ సుఫ్‌యాన్ కుమార్తె ఉమ్మె హబీబా (ర)ను దైవప్రవక్త (స) వివాహమాడారు. ఆ తరువాత అబూ సుఫ్‌యాన్ ఇక మహాప్రవక్త (స)కు ఎదురుబడలేదు.

హజ్రత్ జువైరియా, హజ్రత్ సఫియ్యా (ర)లు ప్రవక్త (స)కు సతీమణు లైన తరువాత బనూ ముస్తలిక్ మరియు బనీ నజీర్ తెగలు ప్రవక్త (స)తో యుద్ధాలు మానేశారు. మహాప్రవక్త (స) ఈ ఇద్దరు మహిళలను పెళ్ళాడిన తరువాత చరిత్రలో ఈ రెండు తెగలు ఎలాంటి పోరాటాలకుగాని, కుట్రలకు గాని దిగినట్లు ఆధారాలు లభించవు. పైగా, హజ్రత్ జువైరియా (ర) తన జాతి స్త్రీలకంటే శుభాలనుగొని తెచ్చారు. అది ఎలాగంటే, దైవప్రవక్త (స) ఆమెతో వివాహమాడగా, సహాబా (ర) ఆమె తెగకు చెందిన వంద కుటుంబా లను, "వీరంతా దైవప్రవక్త (స) గారి అత్తవారి కుటుంబానికి చెందినవారు" అంటూ చెర నుండి విడుదల చేశారు. అలా వారి మనస్సులపై పడిన ప్రభావం ఎలాగుండిందో మనం అర్థం చేసుకోవచ్చు.

అన్నింటికంటే గొప్ప విషయం ఏమిటంటే, మహాప్రవక్త (స) ఓ అనాగరిక జాతికి శిక్షణ గరిపి, దాని హృదయాన్ని ప్రక్షాళన చేసి ఆ జాతి

https://teluguislam.net



వారికి సభ్యతా సంస్కారాలు నేర్పడానికి దైవం తరపున నియమించబడిన మహా మనీషి. అప్పటివరకు ఈ జాతి నాగరికత, సభ్యతా సంస్కారాలు, సామాజిక కట్టుబాట్లు, సత్సమాజ నిర్మాణంలో పాల్గొనే బాధ్యతలు ఏవో తెలియని జాతి. ఇస్లామీయ సమాజ నిర్మాణం ఏ సూత్రాలపైన్నయితే నిర్మించవలసి ఉండిందో, ఆ నిర్మాణ కార్యక్రమంలో స్త్రీ పురుషుల కలివిడికి ఏ మాత్రం వీలులేదు. కాబట్టి అలా కలివిడి లేని సూత్రాలను అవలంబిస్తూ స్త్రీలకు నేరుగా శిక్షణ గరపడానికి వీలుండదు. విద్యావికాసాలు గరపడం, వారిని సుశిక్షితులుగా చేసే అవసరం పురుషులకు తోడు స్త్రీలకు కూడా అంతే ముఖ్యమైనది. ఇంకా చెప్పాలంటే ఆ అవసరం పురుషులకంటే అధికమే.

పల్లెల్లో, నగరాల్లో నివసించే అన్ని రకాల వయస్సు కలిగిన మహిళలకు శిక్షణ గరపడం, వారికి ధర్మశాస్త్ర ఆదేశాలను ఎరుకపర్చడం, వారిలో విద్యా బుద్ధులను వ్యాపింపజేసి వారి హృదయాల నుండి అజ్ఞానపు అంధకారాన్ని పోగొట్టడం మరియు వారిలో ధర్మజ్ఞాన ప్రచారాన్ని చేబట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ కారణం చేత, ఆ లక్ష్యసాధన కోసం దైవప్రవక్త(స)కు రకరకాల వయస్సులు, వివిధ రకాల సామర్థ్యాలు కలిగిన మహిళలను ఎంపిక చేసుకునే అవసరం ఎంతైనా ఉండింది.

కాబట్టి ప్రవక్త మహనీయుల ప్రైవేటు జీవితానికి సంబంధించిన విషయాలను కూడా ముస్లిం సమాజం ముందు పెట్టే ఘనత చాలా మట్టుకు ముస్లిముల మాతృమూర్తులు అయిన ప్రవక్త (స) సతీమణులకే దక్కిందన్న విషయం మనం గ్రహించగలం. ముఖ్యంగా అధిక కాలం వరకు జీవించిన హజ్రత్ ఆయిషా (ర) గారికి ఆ క్రెడిట్టు దక్కుతుంది. ఈమె దైవప్రవక్త (స)గారి ప్రతి కదలికను, ప్రతి ప్రవచనాన్ని ఉల్లేఖించినవారు.

ప్రవక్త మహనీయులు (స) చేసుకున్న వివాహాల్లో ఒక వివాహం, అప్పటి మూఢ ఆచారాన్నొకదాన్ని చెరిపివేయడానికి అమలులోనికి వచ్చింది. ఆ మూఢాచారం అరబ్బు సమాజంలో తాతముత్తాతల కాలం నుండి రివాజులో ఉండి బాగా ముదిరి పోయిన ఆచారం. ఇది ఒకరిని దత్తపుత్రునిగా చేసుకునే ఆచారం. అజ్ఞాన కాలంలో దత్తపుత్రునికి, సొంత కుమారునికి ఉండే

https://teluguislam.net



హక్కులన్నీ ఉండేవి. ఈ ఆచారం, సంప్రదాయం అరబ్బు సమాజం నుండి చెరిపివేయలేనంతగా వ్రేళ్ళూనుకొని ఉంది ఆ కాలంలో. అయితే ఈ మూఢా చారం, ఈ అజ్ఞానపు సంప్రదాయం, ఇస్లామ్ ప్రవేశపెట్టిన నికాహ్, తలాక్, వారసత్వం మరియు ఇతర సిద్ధాంతాలు, సూత్రాలకు పూర్తిగా భిన్నమైన ఆచారం. అదేకాకుండా అజ్ఞాన కాలంనాటి ఈ సంప్రదాయాన్ని మట్టుపెట్టడం ఇస్లామ్ ధర్మం యొక్క ప్రథమ లక్ష్యం కూడా. అందుకని దీన్ని చెరిపి వేయడానికి అల్లాహ్ తన ప్రవక్త (స) వివాహం హజ్రత్ జైనబ్ బిన్తె హజష్‌తో చేయడం జరిగింది. హజ్రత్ జైనబ్ (ర) మొదట హజ్రత్ జైద్ (ర)కు భార్యగా ఉండేవారు. ఈయన దైవప్రవక్త (స)కు దత్తపుత్రుడు. అయితే, ఆ భార్యాభర్తల నడుమ పొసగని కారణంగా హజ్రత్ జైద్ (ర) ఆమెకు తలాక్ (విడాకులు) ఇవ్వడానికి సిద్ధపడ్డారు. దైవతిరస్కారులు దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా అహ్జాబ్ యుద్ధానికి (అగడ్త యుద్ధానికి) సిద్ధపడుతున్న కాలమది. ఇటు దైవప్రవక్త (స)కు దైవం తరపున దత్తత ఆచారాన్ని అంతమొందించే సూచనలు అందుతున్నాయి. ఆ కారణంచేత ఆయన (స) ఈ గడ్డు పరిస్థితిలో హజ్రత్ జైద్(ర) తన భార్యకు తలాక్ గనకా ఇస్తే, ఆ తరువాత ప్రవక్త (స) హజ్రత్ జైనబ్‌ను వివాహమాడినట్లయితే మునాఫిక్‌లు, బహుదైవారాధకులు, యూదులు అందరూ దాన్ని ఆసరాగా చేసుకొని, ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభిస్తారు. అమాయక ముస్లింలను రకరకాల అనుమానాలకు గురిచేసి వారిపై చెడు ప్రభావాలు పడేటట్లు చేస్తారేమో అనే ఆశంక తలెత్తింది. కాబట్టి, అప్పుడు ఆయన (స) ప్రయత్నం అంతా, హజ్రత్ జైద్ (ర) తన భార్యకు విడాకులు ఇవ్వకుండా ఉండాలన్నదే.

కాని అల్లాహ్‌కు ఈ ధోరణి నచ్చలేదు. ఆయన తన ప్రవక్త (స)కు హెచ్చరిక చేస్తూ ఈ క్రింది ఆయత్‌ను అవతరింపజేశాడు.

وَاِذْ تَقُوْلُ لِلَّذِيْٓ اَنْعَمَ اللّٰهُ عَلَيْهِ وَاَنْعَمْتَ عَلَيْهِ اَمْسِكْ عَلَيْكَ زَوْجَكَ وَاتَّقِ اللّٰهَ
وَتُخْفِيْ فِيْ نَفْسِكَ مَا اللّٰهُ مُبْدِيْهِ وَتَخْشَى النَّاسَ ۚ وَاللّٰهُ اَحَقُّ اَنْ تَخْشٰىهُ ؕ

"ఓ ప్రవక్తా! అల్లాహ్, ఏ వ్యక్తికి మేలుచేశాడో ఆ వ్యక్తితో నీవు, 'నీ భార్యను విడిచిపెట్టకు, అల్లాహ్‌కు భయపడు' అని అంటున్న సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో. అప్పుడు నీవు బయటపెట్టదలచిన విషయాన్ని నీ మనస్సులో

https://teluguislam.net



దాచి ఉంచావు. నీవు ప్రజలకు భయపడుతున్నావు. వాస్తవానికి భయపడడానికి అల్లాహ్‌యే ఎక్కువ హక్కుదారుడు." (33 : 37)

ఎలాగైతేనేమి హజ్రత్ జైద్ (ర), జైనబ్ (ర)కు తలాక్ ఇచ్చేశారు. ఆమె ఇద్దత్ గడువు పూర్తి అయిన తరువాత ఆమెతో దైవప్రవక్త (స) వివాహానికి ఆదేశం అవతరించింది. ఈ ఆయత్‌లో అల్లాహ్ ఆయన (స) ఈ నికాహ్ నిర్బంధంగా చేసుకోవాలని ఆదేశించాడు. ఆ ఆయత్ ఇలా ఉంది:

فَلَمَّا قَضٰى زَيْدٌ مِّنْهَا وَطَرًا زَوَّجْنٰكَهَا لِكَيْ لَا يَكُوْنَ عَلَى الْمُؤْمِنِيْنَ حَرَجٌ فِيْٓ
اَزْوَاجِ اَدْعِيَاۤىِٕهِمْ اِذَا قَضَوْا مِنْهُنَّ وَطَرًا ۭ وَكَانَ اَمْرُ اللّٰهِ مَفْعُوْلًا ۝

"తరువాత జైద్ ఆమె విషయంలో తన అవసరాన్ని పూర్తి చేసుకున్నప్పుడు, మేము ఆమె (విడాకులు పొందిన స్త్రీ)తో నీకు వివాహం జరిపించాము. విశ్వాసులకు తమ దత్తపుత్రుల భార్యల విషయంలో, వారు తమ భార్యలకు సంబంధించిన తమ అవసరాన్ని పూర్తి చేసుకున్న పుడు ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు." (33 : 37)

దీని ఉద్దేశ్యం ఏమిటంటే, దత్తపుత్రులకు సంబంధించిన అజ్ఞానపు ఆచారం, అంతకు పూర్వం అవతరించిన ఈ క్రింది ఆదేశాల ద్వారా అంతం చేసినట్లే కార్యరూపంగా అంతమొందించడం.

اُدْعُوْهُمْ لِاٰبَاۗىِٕهِمْ هُوَ اَقْسَطُ عِنْدَ اللّٰهِ

"దత్తపుత్రులను వారి తండ్రులతో ఉన్న సంబంధం ప్రకారం పిలవండి. ఇది అల్లాహ్ దృష్టిలో ఎంతో న్యాయసమ్మతమైన విషయం." (33 : 5)

مَا كَانَ مُحَمَّدٌ اَبَآ اَحَدٍ مِّنْ رِّجَالِكُمْ وَلٰكِنْ رَّسُوْلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِيّٖنَ

"(మానవులారా!) ముహమ్మద్ మీలోని ఏ పురుషునికీ తండ్రికారు. కాని ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త. దైవప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు." (33 : 40)

ఈ సందర్భంగా ఓ విషయాన్ని మనం గమనించాల్సి ఉంది. ఒక సమాజంలో ఏదైనా దుస్సంప్రదాయం లేదా దురాచారం బాగా వ్రేళ్ళూను

https://teluguislam.net



కొనిపోతే, కేవలం మాటల ద్వారా దాన్ని చెరిపివేయలేం. లేదా ఆ ఆచార సంప్రదాయాల్లో మార్పు తీసుకురావడం సాధ్యపడదు. ఏ వ్యక్తి అయితే దాన్ని తుడిచివేయడానికి కంకణం కట్టుకుంటాడో లేదా వాటిలో మార్పులు తెచ్చే కృషి చేస్తాడో, ఆ వ్యక్తి చేతలు కూడా దానికి తగిన విధంగా ఉండడం అవసరం. "హుదైబియా ఒప్పందం" సందర్భంగా ముస్లిముల వైఖరి ద్వారా ఆ యదార్థం మరింత తేటతెల్లం అవుతుంది. 'ఉర్వా బిన్ మస్ఊద్ సకఫీ' హుదైబియాకు వచ్చినప్పుడు ముస్లిముల సమర్పణ త్యాగనిరతి ఎలాంటిదో చూసి ఉన్నాడు. దైవప్రవక్త(స) ఉమ్మి వేసినప్పుడు అది సహాబాల(ర) చేతుల్లో పడుతోంది. వారు దాన్ని అందుకోడానికి, ఆయన (స) వుజూ చేయగా క్రింద ఒలుకుతున్న నీటిని అందుకోడానికి ఎగబడుతున్నారు. అవును! ఈ సహాబాలే ఆ చెట్టు క్రింద మరణాన్నయినా కొనితెచ్చుకుంటామని ప్రవక్త చేతుల మీద ప్రమాణం చేయడానికి తొందరపడుతున్నారు. వీరంతా ఎవరు? వారు హజ్రత్ అబూబక్ర్(ర), హజ్రత్ ఉమర్(ర)లాంటి త్యాగధనులు.

కానీ ఆ సహాబాల(ర) ను - ఎవరైతే ఆయన (స) పై తమ ప్రాణాలను సైతం అర్పించడం అదృష్టం అనుకుంటూ ఉండేవారో- ఒప్పందం కుదిరిన తరువాత, తమ తమ హదీ పశువుల్ని జిబహ్ చేయమని ఆదేశించగా వారిలో ఏ ఒక్కరూ తమ స్థానం నుంచి కదలలేదు. చివరికి ప్రవక్త (స)కు బాధ కూడా కలిగింది. పిదప ఆయన సతీమణి హజ్రత్ ఉమ్మె సల్మా(ర), మీరే లేచి మీ పశువులను జిబహ్ చేయండి అనే సలహా ఇచ్చారు. ఆ సలహాను పాటిస్తూ మహాప్రవక్త (స) తమ కుర్బానీ పశువులను జిబహ్ చేసేశారు. అప్పుడు ప్రతి సహాబీ(ర) ప్రవక్త(స)ను అనుసరించడానికి పరుగులు పెట్టనారంభించాడు. సహాబా లంతా తమ తమ పశువులను జిబహ్ చేసేశారు. ఈ సంఘటన ద్వారా మనకు తెలుస్తోందేమిటంటే, బాగా వ్రేళ్ళునుకొని పోయిన దురాచారాలను రూపుమాపాలంటే మాటలకు, చేతలకు ఉన్న ప్రభావంలో ఎంత తేడా ఉందనేదే. కాబట్టి దత్తత తీసుకునే అజ్ఞాన కాలపు ఆచారాన్ని అంతం చేయడానికిగాను మహాప్రవక్త (స) తన దత్తపుత్రుడు జైద్(ర) విడాలికులిచ్చిన భార్యతో ఆయన (స) వివాహం జరిపించడం జరిగింది.

ఈ నికాహ్ జరగగానే మునాఫిక్‌లు ఆయన (స)కు వ్యతిరేకంగా పెద్ద

https://teluguislam.net



ఎత్తున దుష్ప్రచారాల దుమారాలు లేపడం మొదలెట్టారు. రకరకాల దుష్ట ఆలోచనలను, అపోహల్ని వ్యాపింపజేశారు. వాటి ప్రభావాలు ఎంతో కొంత అమాయక ముస్లిములపై కూడా పడ్డాయి. ఈ ప్రాపగండాను బలపరచడానికి మరో షరయీ (ధర్మశాస్త్ర సంబంధమైన) అవకాశం మునాఫిక్‌ల చేతికి చిక్కింది. అదేమిటంటే, హ్రజత్ జైనబ్ (ర) మహాప్రవక్త (స)కు ఐదవ భార్య కావడం. అప్పటికే ముస్లిములకు నల్గురు భార్యలే ధర్మసమ్మతం అన్న విషయం తెలుసు. అదంతా ఒక ఎత్తు అయితే ఈ దుష్ప్రచారానికి ప్రాణంలాంటి విషయం, అప్పటి వరకు హ్రజత్ జైద్ (ర), దైవప్రవక్త (స)కు కుమారునిగానే తలచబడడం. ఆ కుమారుని భార్యతో నికాహ్ చేసుకోవడం అప్పటి ఆచారాల ప్రకారం వ్యభిచారంగా తలచబడడం. చివరకు అల్లాహ్ అహ్జాబ్ సూరాలో ఈ రెండు విషయాల గురించి ఆయత్‌లు అవతరింప జేయవలసి వచ్చింది. ఆ దైవవాణి అవతరణ జరిగిన తరువాత, సహాబా(ర)కు, ఇస్లామ్ ధర్మంలో దత్తపుత్రునికి ఎలాంటి విలువ లేదు అని, అల్లాహ్ కొన్ని ఉన్నతమైన, ప్రత్యేకమైన ఉద్దేశ్యాల సాధన కోసం తన ప్రవక్తకు ప్రత్యేకంగా, భార్యల సంఖ్య విషయంలో ఇతరులెవరికీ ఇవ్వనటువంటి అనుమతిని ఒసిగాడన్న విషయం తెలిసిపోయింది.

ఉమ్మహాతుల్ మోమినీన్ (విశ్వాసుల మాతృమూర్తులైన ప్రవక్త (స) సతీమణులు) ఎడల దైవప్రవక్త (స) చేసిన సంసారం తీరు ఎంతో గౌరవ ప్రదమైనది, ఉన్నతమైనది మరియు ఎంతో మర్యాదతో కూడుకున్నదిగా ఉండేది. దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, ఎంతో గడ్డు జీవితాన్ని గడుపుతున్నప్పటికీ, మహాప్రవక్త (స) సతీమణులు కూడా తమ దాంపత్య హక్కులను నిర్వర్తిస్తూ, ఆయన (స) ఎడల ఎంత గౌరవంగా, సమ్మతంగా, తృప్తిగా, మర్యాదగా, సహనంగా, సేవా తత్పరతతో మెలిగేవారు. ఈ గడ్డు పరిస్థితులను సహించడం మరొకరి వల్ల అయ్యేది కాదు. హ్రజత్ అనస్ (ర) ఓ ఉల్లేఖనంలో, "దైవప్రవక్త (స), తాము పరమపదించే వరకు మైదా పిండితో చేసిన రొట్టె తినడం గాని, నా కళ్ళతో (ఆయన ఇంట) వేయించిన మేకను చూడడంగాని జరగలేదు" అని చెప్పారు.[2]

---

2. సహీహ్ బుఖారి -2/956

https://teluguislam.net



హజ్రత్ ఆయిషా (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది: "అలా పస్తులతో రెండు నెలలు గడిచిపోయి మూడో నెల నెలవంక అగుపడే వరకు ప్రవక్త (స) ఇంట పొయ్యే వెలగకపోయేది." హజ్రత్ ఉర్వా (ర) ఆమెతో, "మరి మీరు ఏమి తినేవారు?" అని అడగగా, ఆమె, "కేవలం రెండు నల్లని పదార్థాలు. అంటే ఖర్జూరం మరియు నీరు."[3] దీనికి సంబంధించిన హదీసులు అనేకం ఉన్నాయి.

ఇంత గడ్డు పరిస్థితులు చోటుచేసుకొని ఉన్నప్పటికీ, ప్రవక్త (స) సతీమణులచే విమర్శకు గురిఅయ్యే ఏ పొరపాటూ జరగలేదు - కేవలం ఓసారి, అది కూడా మానవ బలహీనతల కారణంగా ఓ పొరపాటు తప్ప. ఈ పొరపాటును ఆధారంగా చేసుకొని కొన్ని ఆదేశాలు ఇవ్వవలసి ఉన్నందున అది జరిగిపోయింది. కాబట్టి అల్లాహ్ ఈ సందర్భంగా వారిని ఇలా హెచ్చరించాడు:

يَاأَيُّهَا النَّبِيُّ قُل لِّأَزْوَاجِكَ إِن كُنتُنَّ تُرِدْنَ الْحَيَوٰةَ الدُّنْيَا وَزِينَتَهَا فَتَعَالَيْنَ أُمَتِّعْكُنَّ وَأُسَرِّحْكُنَّ سَرَاحًا جَمِيلًا ۝ وَإِن كُنتُنَّ تُرِدْنَ اللَّهَ وَرَسُولَهُ وَالدَّارَ الْآخِرَةَ فَإِنَّ اللَّهَ أَعَدَّ لِلْمُحْسِنَاتِ مِنكُنَّ أَجْرًا عَظِيمًا ۝

"ఓ ప్రవక్తా! నీ భార్యలతో ఇలా అను; ఒకవేళ మీరు ప్రాపంచిక జీవితాన్నీ, దాని శోభనూ కోరుతూ ఉన్నట్లయితే, రండి, నేను మీకు ఎంతో కొంత ఇచ్చివేసి మంచి పద్ధతి ప్రకారం సాగనంపుతాను. కాని ఒకవేళ మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, పరలోక నివాసాన్ని కోరుతూ ఉన్నట్లయితే తెలుసుకోండి, మీలోని పుణ్యవతుల నిమిత్తం అల్లాహ్ గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు." (33 : 28,29)

ఇక పరిశుద్ధ సతీమణుల ఔన్నత్యాన్ని కూడా అంచనా వేయండి. వారంతా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)కే ప్రాధాన్యత ఇచ్చారు. వారిలో ఏ ఒక్కరూ ప్రాపంచిక సుఖభోగాల వైపునకు కన్నెత్తయినా చూడలేదు.

ఇలాగే సవతుల నడుమ ప్రతి రోజు కొన్ని మనస్పర్ధలు ఏర్పడుతూనే

3. సహీహ్ బుఖారి-2/956

https://teluguislam.net



ఉంటాయి. కాని సవతుల సంఖ్య అధికమైనప్పటికీ అలాంటి సంఘటన జరగడం ఎప్పుడో ఒకప్పుడు చోటుచేసుకోవడం జరిగింది. అది కూడా మానవ బలహీనతల కారణంగానే. ఆ పొరపాటును అల్లాహ్ ఎత్తిచూపి వారిని హెచ్చరించినందున ఆ తరువాత అలాంటిది మరేదీ జరగలేదు. ఖుర్‌ఆన్‌లోని తహ్రీమ్ సూరా మొదటి అయిదు ఆయత్‌లలో ఆ విషయమే చెప్పడం జరిగింది.

చివరగా, ఈ సందర్భంలో, బహుభార్యత్వం గురించి చర్చించే అవసరం లేదని అనుకుంటున్నాము. ఎందుకంటే దీన్ని అందరికంటే అతిగా విమర్శించే వారు ఐరోపా వారే. వారు ప్రస్తుతం ఏ రకమైన జీవితాన్నయితే గడుపుతున్నారో, మరే దురదృష్టకరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారో మనకు తెలుసు. బహు భార్యత్వ సిద్ధాంతాన్ని కాదని వారెలాంటి బాధలను కష్టాలను ఎదుర్కొంటున్నారో దాన్ని దృష్టిలో ఉంచుకుంటే, ఇక ఈ విషయాన్ని చర్చించే అవసరమే లేదని చెప్పడం సరిపోతుంది. పాశ్చాత్య సమాజపు దురదృష్టకర నికృష్ట జీవితం, బహుభార్యత్వ సిద్ధాంతం సత్యంపై ఆధారపడి ఉందనడానికి నిదర్శనం. వివేకుల కోసం ఇందులో గొప్ప గుణపాఠమూ ఉంది.